

మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ కేశవ్ పాటిల్

వరదనీటి ఇబ్బందులపై చర్యలు చేపట్టాలి

● జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలకు వరదనీటితో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. మన్సూరాబాద్, నాగోల్ డివిజన్‌లో వరదనీరు చేరే పలు ప్రాంతాలైన సితార హోటల్, కేఎల్ఎం షాపింగ్‌మాల్, ఆదర్శనగర్, లక్కీహోటల్, మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంతాల్లో సోమవారం కమిషనర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతిసారి వరదనీరు కాలనీల్లో చేరకుండా పైప్‌లైన్ కెపాసిటి పెంచడానికి తగు ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద దుర్వాసనకు అడ్డుకట్ట వేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వరదనీటితో ప్రజలు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు వీ.అశోక్‌రెడ్డి, రజిని, డీసీ తిప్పర్తి యాదయ్య, రమేష్‌బాబు, నారాయణ, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పని తీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

అంటురోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలు అంటురోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అధికారులకు సూచించారు. చైతన్యపురి డివిజన్ పరిధిలో పారిశుధ్య పని తీరును అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైతన్యపురి రెండవ బస్‌స్టాప్ దగ్గర పేరుకుపోయిన చెత్త,చెదారాన్ని వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమల్, సత్యం పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా మూసారాంబాగ్ డివిజన్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా డివిజన్‌లో పలు చోట్ల నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయని ఆమె వివరించారు. బోనాల ఉత్సవాలకు ముందే పనులు పూర్తి చేసేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డివిజన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, బీజేపీ నాయకులు సంతోష్, సాయియాదవ్, ఉమేష్, దినేష్, వెంకన్న పాల్గొన్నారు.



ప్రజావాణిలో తాగునీరు, డ్రైనేజీలపై చర్చిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురంలోని జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీలకు తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కాలనీవాసుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

పనులను ప్రారంభించండి

వనస్థలిపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు, డ్రైనేజీ పనులను ప్రారంభించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ అన్నారు. ఈ మేరకు కార్పొరేటర్ సోమవారం వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్ రామాంజనేయ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, సహదేవ్‌సింగ్‌నగర్‌లో వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్‌యాదవ్, కేసిరెడ్డి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్

11కేవీ విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్టు కొమ్మలు

● 50 ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట గాయత్రీపురం ప్రధాన రహదారిలో సోమవారం ఉదయం వీచిన పెనుగాలికి చెట్టుకొమ్మలు 11కేవీ విద్యుత్ తీగలపై విరిగి పడ్డాయి. దీంతో పెద్ద శబ్దంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తింది. 40 నిమిషాల పాటు 50 ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారుల సూచనలతో సిబ్బంది తీగలపై పడిన కొమ్మలను తొలగించారు. ఆ తర్వాత విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించారు.



విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్టు కొమ్మలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఘనంగా జగన్నాథ రథయాత్ర

వనస్థలిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం భక్తి కుటీర్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు కాలనీల్లో సోమవారం నిర్వహించిన జగన్నాథ రథ శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి శోభాయాత్రలో కళాకారులతో కలిసి నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలందరూ జగన్నాథ స్వామి ఆశీస్సులతో సుఖఃసంతోషాలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



అనాజ్‌పూర్‌లో నృత్యం చేస్తున్న కళాకారులు



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిలా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లోని రామాలయంలో సోమవారం పూరి జగన్నాథ రథయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల్లో నిర్వహించిన శోభాయాత్రలో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కళాకారులు నృత్యం చేసి అలరించారు. కార్యక్రమంలో అశోక్‌గుప్తా, పారిజాత, విశ్వనాథ్‌గుప్తాతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



వారాహి నవరాత్రి ఉత్సవాలలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు



నవరాత్రి ఉత్సవాలలో విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు జ్ఞాపికను బహూకరిస్తున్న ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్

ముగిసిన వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు

● పాల్గొన్న రాజకీయ, అధికార ప్రముఖులు

ఎల్‌బీనగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో తొమ్మిది రోజులుగా ఘనంగా నిర్వహించిన వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో నవరాత్రుల సేవలో ప్రతిరోజు అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, పారాయణలు, అర్చనలు, మహానక్షత్ర హారతులు వైభవంగా జరిగాయి.

నవరాత్రులలో చివరి రోజు సోమవారం అమ్మవారిని పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పున్నా గణేష్, మధుసూదన్‌రావు, లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్‌యాదవ్, కిరణ్, శేఖర్ ముదిరాజ్, సురేంద్ర, మహేందర్, సైదులు, శ్రవణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

● జలమండలి ఎండీకి విన్నవించిన ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని డివిజన్ల వారిగా తలెత్తుతున్న సివరేజీ సమస్య పరిష్కారానికి, తాగునీటి సరఫరాను మెరుగుపరచేందుకు చేపట్టే చర్యల కోసం రూపొందించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి అందజేశారు. అనంతరం డివిజన్లలోని సైదాబాద్, మూసారాంబాగ్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపుర, చావునీ డివిజన్లలో సివరేజీ సమస్య తీవ్రంగా ఉందని, నూతన పైప్‌లైన్ల నిర్మాణంతోపాటు ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ల మార్పిడి చేసేందుకు గాను దాదాపు రూ.5కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు ఎమ్మెల్యే ఎండీకి విన్నవించారు. వీటితోపాటు చాలా చోట్ల ఇంకా తాగునీటి సరఫరాను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని, అందుకు అవసరమైన పైప్‌లైన్లను నిర్మించాల్సి ఉందని వివరిస్తూ ఇందుకు గాను మరో రూ.3కోట్లతో చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా అందజేశారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎండీ సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపినట్లు సమాచారం.



జలమండలి ఎండీకి ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

రహదారులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

● ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాలనీ అంతర్గత రహదారులను ఆక్రమించి, రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వీ.సైదిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ థియేటర్ - పీ అండ్ టీ కాలనీ రహదారి, సాయిబాబా ఆలయం - పీ అండ్ టీ కాలనీ రహదారిలో రోడ్డు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాలనీ అంతర్గత రహదారులను ఆక్రమించి క్రయ, విక్రయాలు జరుపుతున్న చిరువ్యాపారుల బండ్లు, దుకాణాలను తీయించారు. రోడ్డు ఆక్రమణల వలన పాదచారులకు, వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఇకమీదట ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఎస్ఐ మారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

ఈస్ట్‌జోన్ డీసీపీగా బాలస్వామి

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్‌జోన్ డీసీపీగా బాలస్వామి నియమితులయ్యారు. సోమవారం ఆయన అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారి బాలస్వామి నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి మండలానికి చెందిన వారు. గతంలో రాచకొండ ఎస్‌బీ, సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీగా, మెదక్ ఎస్పీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.



బాలస్వామి

ఆర్వోబీల వద్ద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి

● దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జిల దగ్గర నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయులుతో కలిసి వివిధ శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆర్వోబీ, ఆర్‌యూబీల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు వీటి దగ్గర చేరే అవకాశం ఉందని, నీరు నిలువకుండ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. నీరు వెళ్లేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలని, నీటి పంపింగ్ వ్యవస్థలను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భద్రతకు సంబంధించి 24 గంటలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ సమావేశానికి సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్లు హాజరయ్యారు.

19న ఈసీఐఎల్ నుంచి అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ఏఎస్‌రావునగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన అరుణాచలంకు ఈసీఐఎల్(కుషాయిగూడ) నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు నడపనున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ పీ.చంద్రకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సాయంత్రం 7 గంటలకు ఈ బస్సు (నెం-98884) ఈసీఐఎల్ నుంచి బయలుదేరి నాగారం, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, తార్నాక, ఎంజీబీఎస్ మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం పౌర్ణమి రోజున 21న ఉదయం అరుణాచలం చేరుకుని భక్తుల గిరిప్రదక్షిణం పూర్తిచేసుకుని అదే రోజు సాయంత్రం అక్కడి నుంచి తిరిగి బయలుదేరి 22న ఉదయం బస్సు ఈసీఐఎల్‌కు చేరుకుంటుందని డీఎం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులో ఒక్కొక్కరికి (పిల్లలు/పెద్దలు)టికెట్ ధర రూ. 3790లుగా నిర్ణయించారని పేర్కొన్నారు. దర్శనం, భోజనం, వసతి ఖర్చులు ప్రయాణికులే భరించుకోవాలని తెలిపారు. ఆసక్తి గల ప్రయాణికులు టికెట్స్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిజిఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్‌లో గానీ, ఈసీఐఎల్ బస్‌టర్మినల్, నేరేడ్‌మెట్, నాగారం, మల్కాజిగిరిలోని ఏటీబీ ఏజెంట్ కౌంటర్‌లలో సంప్రదించి టికెట్ బుక్ చేసుకోవాలన్నారు.



రమేష్‌గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌గౌడ్‌కు నివాళి

చంపాపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ 65వ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రమేష్‌గౌడ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లింగోజీగూడ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల అఖిల్‌గౌడ్, బీజేపీ నాయకులు, కాలనీల ప్రతినిధులు ప్రవీణ్‌గౌడ్, టింగ్లీకర్ రాజేష్, ప్రదీప్, రాములుగౌడ్, ఆకుల శ్రీనివాస్, పాలెం శేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెయిలింగ్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా తొలి రోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సోమవారం హుస్సేన్‌సాగర్‌లో ప్రారంభమైన ఈ పోటీల్లో సెయిలర్లు వర్షం, భారీ గాలులను సైతం లెక్క చేయకుండా పోటీల్లో పాల్గొన్నారు. అండర్-16 ఆప్టిమిస్ క్లాస్‌లో తొలి రోజు పోటీలు ముగిసేసరికి హైదరాబాద్ సెయిలర్లు గోవర్ధన్ ద్వితీయ, బి.బన్నీ తృతీయ స్థానంలో నిలిచారు.



మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్రీడాకారులకు ముఖ్యమంత్రి అభినందనలు

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. క్రీడాకారులు సోమవారం ముఖ్యమంత్రిని కలిశారు. నేపాల్‌లో జరిగిన యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ఆరు బంగారు, రెండు రజిత పతకాలు సాధించారు. సాయిహస్సిక అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్, సర్దార్ అంగద్ సింగ్ సిద్దూ అండర్ - 17 ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. సురేందర్ అండర్ - 25 పిస్టల్ విభాగంలో గోల్డ్, రాథోడ్ సంతోష్ అండర్ - 30లో బ్రేక్ బారెల్ విభాగంలో గోల్డ్, సిల్వర్ మెడల్, బైరగోని అరుణ్‌కుమార్ ఓపెన్ క్యాటగిరి ఎయిర్ రైఫిల్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు.

మేరులకు రాజకీయ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

● డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు వినతి

చాదర్‌ఘాట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్న మేరు కులస్థులను అన్నిరంగాల్లో ప్రోత్సహించేలా రాజకీయ పదవుల్లో ప్రాధాన్యత నివ్వాలని కోరుతూ తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను మేరు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొల్కం వినయ్‌రాజ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. సోమవారం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను ఆయన ఘనంగా సన్మానించారు. వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మేరు కులస్థులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా పార్టీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించి పదవులు ఇవ్వడంలో ప్రాధాన్యతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను సన్మానిస్తున్న పొల్కం వినయ్‌రాజ్

బీసీ యువజన రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్

హయత్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సోమవారం నిరుద్యోగులు, బీసీ విద్యార్థుల సమస్యలపై సెక్రటేరియట్ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో పోలీసులు బీసీ సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. సామనగర్‌లో నివాసం ఉండే బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజిని సోమవారం ఉదయం హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు ఇవ్వొద్దు

హయత్‌నగర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు ఇవ్వవద్దని కోరుతూ హయత్‌నగర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు దీక్ష చేశారు. 23 సంవత్సరాలుగా విద్యార్థులకు వంటచేసి పెడుతున్నామని పలువురు తెలిపారు. ఇప్పుడు ఉన్నట్టుండి తీసివేసి మరో సంస్థకు ఇస్తామనడం సరికాదని అన్నారు. తమకు కాకుండా అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు ఇస్తే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నర్సింహ, నవనీత, మంజుల, స్వరూప, లక్ష్మమ్మ, రమాదేవి, రంగమ్మ, నిర్మలమ్మ, రాజమణి, రాములమ్మ, వెంకటమ్మ, మంగమ్మ, వనజ పాల్గొన్నారు.




విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన పత్రికలను అందుకుంటున్న సురేష్

ఆగస్టు 9 నుంచి బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ 5వ వార్డులో నూతనంగా నిర్మించిన బంగారు మైసమ్మగుడిలో ఆగస్టు 9వ తేదీ నుంచి 11 వరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వార్డు కౌన్సిలర్ బొర్ర అనురాధసురేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పెద్దఅంబర్‌పేట్‌లోని హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన పత్రికను ఆలయ పూజారి రామకృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన కౌన్సిలర్లు విద్యావతివిజయేందర్‌రెడ్డి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీరాజు, చల్లూరి మురళీధర్‌రెడ్డి, సిద్దంకి కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పొడిశెట్టి సబితాశ్రీనివాస్‌గౌడ్‌తో పాటు గ్రామపెద్దలు, కుల సంఘాలు, కాలనీవాసులు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని కౌన్సిలర్ కోరారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో పడుకున్న వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రామలాల్(29) ఊరువెళదామని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబరు 2లో కూర్చోని విశ్రాంతి తీర్చుకునేందుకు పడుకున్నాడు. పడుకున్న వ్యక్తి అలాగే చనిపోవడంతో ఈ విషయాన్ని గమనించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మరణించాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని..



రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మరణించిన ఘటన గుండ్లపోచంపల్లి ఏరియాలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే కానిస్టేబుల్ డెవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి సమీపంలో గుర్తుతెలియని 25ఏళ్ల వ్యక్తి సోమవారం రైలుపట్టాలు దాటుతుండగా ఆ సమయంలో అటుగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో బలమైనగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ దూద్‌బావి వద్ద నివసిస్తున్న గణేష్(31) కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్య గొడవపడి ఇటీవల పుట్టింటికి వెళ్లింది. ఆమె రానని చెప్పడంతో గణేష్ మనస్తాపం చెందాడు. సోమవారం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.